క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

కూసుమంచి: పదో తరగతి, ఇంటర్ చదువు మధ్యలో ఆపేసిన వారు, రెగ్యులర్‌గా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేని వారికి సార్వత్రిక విద్య ద్వారా చదువుకునే అవకాశాన్ని కల్పిస్తుందని కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాయల వీరస్వామి అన్నారు. తమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ద్వారా ఈ నెల 11 వరకు అడ్మిషన్ పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99485 97174 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్పౌజ్ బదిలీలపై హర్షం

కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల దంపతులను ఒకే ప్రాంతంలో పనిచేసేలా చర్యలు తీసుకోవడంపై స్పౌజ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బానోత్ అమృనాయక్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఉద్యోగుల కష్టాలను గుర్తించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో శ్రీ భవానిమాత అమ్మవారి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు భానుప్రకాశ్ ప్రత్యేక పూజలు చేయగా.. భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెంకటనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ వార్షిక పరీక్షలపై అవగాహన

రఘునాథపాలెం: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను ఎలా సన్నద్ధం కావాలి అనే అంశాలపై వీవీపాలెం పల్లెదవాఖానా డాక్టర్ మౌనిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని వీవీపాలెం పాఠశాల విద్యార్థులకు టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు ఉచిత కౌన్సెలింగ్ కోసం 14416 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆతర్వాత దవాఖానా పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, పద్మ, మౌనిక తదితరులు సైతం మాట్లాడగా.. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులంలో తహసీల్దార్ తనిఖీ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ విల్సన్‌బెన్నీ తనిఖీ చేశారు. హాస్టల్ తనిఖీల్లో భాగంగా పాఠశాలలో వంటశాల పరిసరాలు, భోజనం తయారీ, నాణ్యతలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశాక మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పకుండా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప–2
వినోద	పుష్ప–2
సాయిరాం	పుష్ప–2, అమరన్
ఆదిత్య	పుష్ప–2
శ్రీనివాస	పుష్ప–2
సినీ గెలాక్సీ	పుష్ప–2

– ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	28	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	54	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	58		20
గోరుచిక్కుడు	28	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	38		40
చామగడ్డ	38	పుదీన	1
క్యారెట్	48		25
క్యాప్సికం	54	–ఖమ్మం వ్యవసాయం	



గతంలో సారథినగర్–మామిళ్లగూడెం ఆర్‌యూబీ (ఫైల్)



నిర్మాణం పూర్తయ్యాక ఇలా..

ఆర్‌యూబీకి మోక్షం..!

- సారథినగర్–మామిళ్లగూడెం ఆర్‌యూబీ మధ్య రాకపోకలు మరూ
- తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర
- నేడు మంత్రి తుమ్మలచే ప్రారంభం

ఖమ్మంరాపర్తినగర్: నగరంలోని సారథినగర్–మామిళ్లగూడెం మధ్య నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ బ్రిడ్జి ఎప్పుడు వినియోగంలోకి వస్తుందా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. పలు కారణాలతో ఈ బ్రిడ్జి చాలా ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంది. అయితే మున్సిపల్, రైల్వే శాఖల అధికారులు ముందుకొచ్చి నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో నేడు(శనివారం) రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఆర్‌యూబీని ప్రజలకు అంకితం చేయనున్నారు.

ఎట్టకేలకు పూర్తి..

ఆర్‌యూబీ పనులను పూర్తి చేసేందుకు మున్సిపల్, రైల్వే శాఖ అధికారులు ముందుకొచ్చారు. గతంలో రూ.56 లక్షల అంచనా వ్యయంతో ఈ నిర్మాణాన్ని ప్రారంభించినా.. ఆ తర్వాత అది రూ.1.90 కోట్లకు పెరిగింది. గత ఏడాది కాలంగా అన్ని అనుమతులు పొందుతూ నిర్మాణాన్ని అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా దాదాపు తొమ్మిదేళ్లపాటు పూర్తి కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి తుమ్మలచే ప్రారంభం..

సారథినగర్–మామిళ్లగూడెం మధ్య ఆర్‌యూబీని శనివారం ఉదయం 9 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఈ దారి గుండా రాకపోకలు సాగనున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల మరోసారి మంత్రి హోదాలో ఆర్‌యూబీని ప్రారంభిస్తుండడం విశేషం.

తొమ్మిదేళ్లుగా ఎదురు చూపులు..

సారథినగర్–మామిళ్లగూడెం మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ వ్యవహారం చాలా ఏళ్లుగా నలుగుతోంది. 2007లో అప్పటి మంత్రి సంభాని చంద్రశేఖర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయించినా స్థానికులు కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయింది. ఆ తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని 2016, జనవరి 17న రూ.56 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయినా అప్రోచ్ రోడ్డు విషయంలో అభ్యంతరాలు వ్యక్తమై పలు అవాంతరాలు ఎదురుకావడంతో పనులు నత్తనడకన సాగుతూ.. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఆర్‌యూబీ పూర్తికాక నిరుపయోగంగా మారింది.

ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: మామిళ్లగూడెం–సారథినగర్‌లను అనుసంధానించే రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ బ్రిడ్జికి ఇరువైపుల కలెక్టర్ స్థానికులతో కలిసి తిరిగి, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ వి.రవికుమార్, ఆర్‌ఐ ఎస్‌కె వహీద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

పంట అవశేషాలను కాల్చొద్దు



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సరిత

ఖమ్మంరూరల్: రైతులు వరిపంట కోతలు పూర్తయ్యాక ఎట్టి పరిస్థితుల్లోనూ పంట అవశేషాలను కాల్చరాదని కూసుమంచి ఏడీఏ సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లెగూడెం, గోళ్లపాడులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వరిపంట కోతలు పూర్తయిన నేలలను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ కర్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడంతో పాటు పర్యావరణానికీ నష్టం కలుగుతుందన్నారు. పంట అవశేషాలు, వరి కొయ్యలను నేలలో కలిపి దున్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయడం ద్వారా కొయ్యలు మురిగి మంచి ఎరువుగా తయారై పంట ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతిని భవిష్యత్‌లో పంటలు పండే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు సూచనల మేరకే ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానగేష్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మహాపడి పూజ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ముస్తఫానగర్‌లో శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి మహాపడిపూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోదాడ భాస్కర్ గురుస్వామి భజన బృందం అయ్యప్ప గీతాలతో అలరించగా, గుంటూరుకు చెందిన రాము భవానిస్వామి పలు దేవతామూర్తుల వేషధారులతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి చైర్మన్ చిర్రా రవి, పుట్ట మల్లికార్జున్, కృష్ణమూర్తి, నిదికొండ శేఖర్, కూరపాటి రవితేజ, మాచర్ల నరేష్, సామినేని రవి, చందా రాంబాబు, వీరభద్రం, కిషన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాంక్యాతండాలో మాలధారుల ఇరుముడి

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాలో గల శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం ఇరుముడి వేడుకలను ఘనంగా నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష అనంతరం సుమారు 56 మంది ఇరుముడితో శబరియాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాలధారులు మంగీలాల్, చరణ్గురు స్వామి, రామారావు గోలియా, రవి, మల్సూర్ సింగ్, తారచంద్, మోతిలాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 8న నిర్వహించే సీపీఎం ఖమ్మం నియోజకవర్గస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.విక్రం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సెయింట్ మేరీస్ ఎయిడెడ్ పాఠశాలలో జరిగే మహాసభల ఏర్పాట్లను సీపీఎం ఖమ్మం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ మహాసభలో గత మూడేళ్లుగా నియోజకవర్గ పరిధిలో పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకోవడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా చర్చి కాంపౌండ్ నుంచి మహాసభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, వన్‌టౌన్ కార్యదర్శి షేక్ నాగుల మీరా, నాయకులు అంబటిపూడి సుధాకర్, ఉమ్మినేని రాంబాబు, పుట్టా రవి, దాసరి నాగేశ్వరరావు, సత్తారు తదితరులు పాల్గొన్నారు.

‘అలవికాని హామీలతో ప్రభుత్వ మోసం’

కూసుమంచి/నేలకొండపల్లి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చి మోసం చేస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ అన్నారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పార్టీ ఆధ్వర్యాన కూసుమంచిలోని శివాలయం నుంచి ఖమ్మం రూరల్ మండలం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా.. నేటికీ హామీలు అమలు కాలేదన్నారు. ఆరు అబద్ధాలు.. 66 మోసాల రీతిన రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. హామీల అమలుకు తమ పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, జిల్లా కార్యదర్శి హట్యా నాయక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, రవి రాథోడ్, గుండా ఉపేందర్‌రెడ్డి, వీరభద్రం, సుధాకర్, వెంకటరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరుతూ నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యాన శుక్రవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, భువనాసి దుర్గారావు, కొండ హర్ష, ఇస్లావత్ నాగేశ్వరరావు, ఎం.రమేష్, బి.రామకృష్ణ, గెల్లా సాయి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత తరోడ్డు విద్యుత్ సెక్షన్ కార్యాలయం పరిధిలోని మైసమ్మ గుడి ఫీడర్, డైరీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈఈఆర్ రిస్టార్స్, దేవీ అపార్ట్‌మెంట్, అక్షయ అపార్ట్‌మెంట్, పోలీసు కాలనీ, మమత మెడికల్ కాలేజ్, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రఘునాథపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తహసీల్దార్ కార్యాలయం, కేటీఆర్ నగర్, పువ్వాడ నగర్, శివాయిగూడెం, గ్రీన్‌కాలనీ, కోయచలక, దారేడు, జింకలతండా తదితర ప్రాంతాల పరిధిలో అంతరాయం ఉంటుందని రఘునాథపాలెం ఏఈ జె.శంకర్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

‘పోటు’ ఉద్యమాలు చిరస్మరణీయం

ఖమ్మంరూరల్: పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోటు ప్రసాద్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం తన తుది శ్వాస వరకూ పోరాడారని, ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.వీరభద్రం, చెరుకుపల్లి భాస్కర్, పి.చంద్రరావు, బి.జగన్, ఆర్.ప్రీను, గణపారపు ఉపేందర్, మేళ్లచెరువు సాయి, మిరియాల తేజ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మంవన్‌టౌన్: మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించి పలువురికి నివాళులర్పించారు. అమెరికా కాల్పుల్లో మృతిచెందిన రామన్నపేటకు చెందిన నూకారపు సాయితేజ, ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పడమటితండా వాసులు గుగులోత్ శివరాజు, మూడ్ హర్షవర్ధన్‌ల మృతదేహాలను ప్రభుత్వాస్పత్రి పోస్టుమార్టం గదిలో సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కంచె ఏర్పాటు చేయాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం సమీపంలో పూర్వం పాము బండగా పేరున్న స్థలం(డైక్)కు కంచె ఏర్పాటు చేయాలని తెలంగాణ చారిత్రక కమిటీ సభ్యుడు కట్టా శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆట్టి స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ స్థలం ఖమ్మం నుంచి దనియాలగూడెం వరకు ఉందని, దీన్ని పర్యాటక ప్రాంతం, సైన్స్ విజ్ఞానం కోసం విద్యార్థులకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శం

ప్రముఖ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, గొప్ప సంఘసంస్కర్తగా, రాజకీయనేతగా, బహుముఖ ప్రజ్ఞాశీలిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం భావితరాలకు ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలు, పలు స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ఆయన అందించిన రాజ్యాంగం గొప్ప ఆయుధమని పేర్కొంటూ ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. – సాక్షినెట్‌వర్క్



ఖమ్మంవైద్యవిభాగం: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి



ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



ఖమ్మంఅర్బన్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో..



ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జెడ్పీసెంటర్‌లో నివాళులర్పిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు



ఖమ్మంలీగల్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు



ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో..



తిరుమలాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కూసుమంచి: నాయకన్‌గూడెంలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

‘ప్రజావాణి’లో ఫిర్యాదులు పరిష్కరించాలి

కామేపల్లి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు అన్నారు. శుక్రవారం కామేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండి రైతులు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఆర్‌ఐ సక్రు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ నరసింహారావు

హమాలీలను అడ్డుకోవడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న హమాలీలు

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): హమాలీలను అడ్డుకోవడం సరికాదని ఖమ్మం ఎఫ్‌సీఐ గోదాం హమాలీలు ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 15ఏళ్లుగా ఖమ్మం ఎఫ్‌సీఐ గోదాంలో హమాలీలుగా పనిచేస్తున్నామని, తమకు పని దొరక్కుండా కొందరు అర్హత లేని 30 మందిని పనిలోకి తీసుకోవాలని సదరు కాంట్రాక్టర్‌పై కొందరు ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో హమాలీలు సురేష్, రంజిత్, వీరబాబు, వీరేష్, ఏడుకొండలు, మురళీకృష్ణ, కాంట్రాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా 6వ విద్యా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం విద్యా మహాసభల పోస్టర్లను రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జాగటి యాకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో ఈ మహాసభలు జరుగుతాయని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి–ఉపాధ్యాయుల కర్తవ్యాలు, వారి సమస్యలు, చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శులు పి.సురేష్, డి.నాగేశ్వరరావు, ఎస్.సతీష్, ఉద్దండ్ షరీఫ్, కేశ్యా, మహేష్, కృష్ణయ్య, చిన్న రంగారావు, షరీఫ్, నవీన్ కుమార్, వెంకటనర్సయ్య, రవిబాబు తదితరులు ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బందెలదొడ్డి.. బహు బాగు!

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోనే పెద్ద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లలో ఒకటైన నగరంలోని బైపాస్ రోడ్‌లో గల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో పశువుల నియంత్రణ కోసం మార్కెట్ అధికారులు బందెలదొడ్డిని ఏర్పాటు చేశారు. అయితే ఈమార్కెట్‌కు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూరగాయలు, దుంపలను రైతులు, వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తుండగా.. విక్రయాల్లో దెబ్బతిన్న, కుళ్లిన కూరగాయలు, దుంపలను పక్కనే వ్యర్థాలుగా పోస్తుంటారు. అయితే మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పాడి కోసం పెంచుతున్న గేదెలు, ఆవులను మార్కెట్‌లోకి ఆయా యాజమానులు వదులుతుండడంతో అవి పాడైన కూరగాయలతో పాటు అమ్మకానికి ఉంచిన మంచి కూరగాయలను సైతం పాడు చేస్తున్నాయి. దీంతో మార్కెట్ అధికారులు మార్కెట్‌లోని గేటు వద్ద బందెల దొడ్డి మాదిరి నిర్మాణం చేసి అందులోకి వచ్చిన పశువులను వాచ్‌మెన్‌ల చేత ఆ బందెల దొడ్డిలోకి తోలిస్తున్నారు. ఆతర్వాత యజమానులను పిలిపించి హెచ్చరికలు చేసి మరోసారి మార్కెట్‌లోకి రానివ్వొద్దని అవగాహన కల్పించి పంపిస్తున్నారు.



బందెలదొడ్డిలో పశువులు